క్లుప్తంగా

ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా



మాచర్ల: రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్రా.. యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మాట్లాడారు. డిసెంబర్ 15 నుంచి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, అల్లి సురేష్‌తో పాటు ఆయా శాఖాధికారులు పీఈటీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



దాచేపల్లి : దివ్యాంగులకు అండగా ఉంటామని ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నాగెండ్ల సుమతీరత్నం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నారాయణపురం ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఆదివారం నిర్వహించారు. టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు 5 ట్రైసైకిళ్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమతీరత్నం మాట్లాడుతూ టిక్నో పెయింట్స్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామని, భవిష్యత్‌లో అన్ని విధాలుగా దివ్యాంగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనగర్ ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ బండ్ల ఏసుపాదం, నాయకులు బండ్ల మరియదాసు, పత్రా ప్రభుదాసు, కటికల మరియబాబు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఎంఆర్‌ఎఫ్ షోరూం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో పత్తితీత పనులకు వెళ్తుండగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారెబోయిన ఆదిలక్ష్మి, గుమ్మా రమణ, అంజిలకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గుంటూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి, స్వల్పంగా గాయపడిన వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిమితికి మించి వ్యవసాయ కూలీలతో ఆటోలు వెళ్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అన్నారు.

ఎండుగుంపాలెంలో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: ఎండుగుంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ నోవాకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో జనరల్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, కంటితో పాటూ స్త్రీల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. మెరుగైన వైద్యం కోసం కొందరిని ఎంపిక చేశారు. మైనంపాడు నైస్ పాఠశాల సిబ్బంది అల్పాహారం పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన...

సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ చంద్ పాలేకర్ శిష్యులైన విద్యారాం స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చి, పలు సూచనలు చేశారు.

తాళాలు వేసిఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం

గుంటూరు ఈస్ట్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన రాజ్యలక్ష్మీ నగర్‌లో జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సర్వీస్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పారు. హైఓల్టేజీ కారణంగా కాలనీలోని పలు గృహాల్లో అనేక విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్థానికులు ఈ ఘటనపై ఆందోళన వెలిబుచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఇల్లు ఎవరిదో వివరాలు తెలియలేదు.

సమైక్యతకు చిహ్నం కార్తీక వన భోజనాలు



వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: భక్తేకాదు...సమైక్యతకు, చక్కని ఆరోగ్యానికి కార్తీక మాసంలో వన భోజనాలు ప్రతీకలని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారు కొండమోడు ప్రాంతంలోని శ్రీ ముషుకుంద మహర్షి కోటిరెడ్డి ఆశ్రమంలో దీ కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 32వ కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రత్యేక దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీక మాసంలో అందరు కలిసిమెలిసి వన భోజనాలు చేయటం వలన ఆధ్యాత్మికత, ఆరోగ్యంతోపాటు, ఆప్యాయత అనురాగాలు పెంపొంది, సామాజిక సామరస్యతకు, సమైక్యతకు దోహదం చేస్తుందన్నారు. అనంతరం దీ కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎమ్మెల్యే కాసును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రు నిరామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, దీ కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పందిటిరామిరెడ్డి, ఉపాధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, సెక్రటరీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ వి.మల్లిఖార్జునరెడ్డి, ట్రెజరరీ పుణ్యాల వీరారెడ్డి, గౌరవాధ్యక్షులు సింగంపల్లి ముత్యాలరెడ్డి, దగ్గుల గంగాయమ్మ, గౌరవాధ్యక్షులు చింతారెడ్డి వెంకటరెడ్డి, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శాలివాహన కార్తీక వన మహోత్సవం...

ఆధునిక జీవన సమయంలో, నిత్యం తీరకలేని జీవతాలలో అందరితో, ఆహ్లాదంగా గడిపేందుకు కార్తీక వన భోజనాలు దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ జూనియర్ కాలేజీ పక్కన శాలివాహన వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ కార్తీక వన భోజనాలు సాంస్కృతిక, హైందవ ధర్మ మార్గాన్ని నేటి తరానికి అందిస్తాయని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో కలిసి విందు భోజనాలు చేయటం సమైక్యతకు చిహ్నం అన్నారు. అనంతరం శాలివాహన వన భోజన కమిటీ ఎమ్మెల్యే కాసును సత్కరించారు. ఎంపీడీవో కాశయ్య, ఇల్లూరి వెంకయ్య, రాఘవేంద్రరావు, వెంకటేశ్వర్లు, శ్రీను, మద్దికొండ సైదులు, నల్లపాటి నాగేశ్వరరావు, కానాల వెంకటేష్, శాలివాహన సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన



భక్తులకు అన్నదానం చేస్తున్న పీవీఆర్

మాచర్ల: నియోజకవర్గంలోని పట్టణంలో వేంచేసి యున్న మరికతలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు అప్పీ శ్రీను, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావుతో పాటు రజక సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

విద్యలో రాణించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : విద్యలో యాదవులు రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. దాచేపల్లి మండల గోకుల శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవుల కార్తీక మాస వనసమారాధన కార్యక్రమం దాచేపల్లిలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. వన సమారాధన సభలో ఆయన మాట్లాడుతూ..విద్యలో రాణిస్తే సామాజికంగా, ఆర్థికంగా రాణించగలమని చెప్పారు. యాదవ కుటుంబ సభ్యులంతా ఐక్యమత్యంగా ఉండాలని, ఐక్యమత్యంగా ఉంటే అన్ని విధాలుగా అభివృద్ధి చెందగలమని వ్యాఖ్యనించారు. నీతి, నిజాయితీలకు మారుపేరుగా యాదవులు నిలిచారని, చరిత్రలో యాదవులకు ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పారు. అనంతరం పలువురు యాదవ కులస్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు జంగా వెంకటకోటయ్య, శివయాదవ్, సర్పంచ్‌లు జంగా సురేష్, శ్రీనివాసరాజు, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు, దాసరి శివకుమార్, కమిటీ సభ్యులు సంకురాత్రి వెంకటేశ్వర్లు, బంబొతెల వెంకటేశ్వర్లు, జంగా శివ, యామర్తి సైలీంద్ర, కల్లూరి లింగయ్య, జేసీబీ సాయి, జక్కుల వీరాస్వామి, గొట్టిముక్కల కోటేశ్వరరావు, మర్రెబోయిన మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఆసక్తిగా కొనసాగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు



ధర్మవరంలో ఎడ్ల బల ప్రదర్శనను నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గి: ప్రసిద్ధిగాంచిన హరిహర బాల నాగేంద్రస్వామి తిరునా సందర్భంగా ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బల ప్రదర్శన మూడో రోజు కొనసాగింది. ఆదివారం ప్రత్యేక కేటగిరి విభాగంలో హైదరాబాదుకు చెందిన మేక రామకృష్ణ ఎడ్లు నిర్ణీత సమయంలో ఐదు వేల అడుగులు దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషస్వారెడ్డి ఎడ్లు 4,798.8 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానం, పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి ఎడ్లు 4,758 అడుగులతో మూడవ స్థానం, కృష్ణా జిల్లా కొక్కిలగడ్డ గ్రామానికి చెందిన రాఘవయ్య మెమోరియల్ బాబు 4,385.05 అడుగులతో నాలుగవ స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 4,300 అడుగులతో ఐదవ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతు సోదరులు, పశుపోషక అభిమానులు తరలివచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోటీల వ్యాఖ్యాతగా గూడా రామకృష్ణ వ్యవహరించారు. నిర్వాహకులు ఎడ్ల యజమానులకు తగిన ఏర్పాట్లను చేసి పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

గుర్తుకొస్తున్నాయి..!

1975–76 పదోతరగతి బ్యాచ్ బాలుర మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం



47 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నరసరావుపేట: ఒక చోట చదువుకొని దేశ, విదేశాల్లో వివిధ ప్రదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు 47ఏళ్ల అనంతరం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వారి వారి కుటుంబ విశేషాలను చెప్పుకొన్నారు. తమ ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని ఒకరికొకరు సలహాలు ఇచ్చుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. పట్టణంలోని బాలుర ఉన్నత మున్సిపల్ హైస్కూలు 1975–76 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన వారందరూ 47 ఏళ్ల అనంతరం మొదటి రైల్వే గేటు సమీపంలోని స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో ఆదివారం సమావేశమయ్యారు. అందరూ ఒకే విధమైన టీషర్టులు ధరించి పాల్గొన్నారు. వారి అపూర్వ సమ్మేళనం భావితరాలకు మార్గదర్శకంగా మారనుంది.

చిలకలూరిపేటటౌన్: విలువలతో కూడిన విద్యనిచ్చిన విద్యాలయాన్ని పూర్వ విద్యార్థులు మరవరాదని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988 సంవత్సరం నుంచి 2022 మధ్య విద్యనభ్యసించిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు, ఆనాటి సంఘటనలు గుర్తుచేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ కమిషనర్ సి.ప్రభాకరరెడ్డి, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పొంది సచివాలయ వ్యవస్థపై ఆరోపణలా..?

మహిళ ఆరోపణలను ఖండించిన వార్డు పరిపాలన కార్యదర్శి

నరసరావుపేట: చేబ్రోలుమండలం వేజెండ్ల గ్రామానికి చెందిన గోగిరెడ్డి విజయమ్మ అనే మహిళ సచివాలయంలో ఎటువంటి పనులు జరగట్లేదని, డబ్బులు వసూలుచేస్తున్నారంటూ చేసిన ఆరోపణలను వార్డు సచివాలయ పరిపాలన కార్యదర్శి బీకే కవిత ఖండించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 24వ వార్డులో నివాసం ఉంటున్న విజయమ్మ సచివాలయానికి వచ్చి తన రేషన్‌కార్డులో ఉన్న కుమార్తెకు వివాహం జరిగినందున ఆమె పేరును తొలగించాలని కోరిందన్నారు. ఆమె ఆధార్‌కార్డు పరిశీలించగా చేబ్రోలు మండలానికి చెందిన వారు కాబట్టి అక్కడ మార్పించుకోవాలని సూచించామన్నారు. అయినప్పటికీ ప్రయత్నించగా వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు అప్‌లోడు చేయాలని సూచించిందన్నారు. అవి తీసుకురాకుండా పనిచేయలేదని తమపై ఆరోపణలు చేసిందన్నారు. వైఎస్సార్ పింఛను, ఈబీసీ నేస్తం, మనవడికి అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలు సచివాలయం నుంచి పొంది తమపై ఆరోపణలు చేయటం బాధాకరంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా విచారణ చేసి ఆమెపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం మరింత బలపడి తుపాన్‌గా మారిన నేపథ్యంలో మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4, 5 తేదీలలో కనీసం 40 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒక వేళ కోతలు కోసిన రైతులు వెంటనే కుప్పలు పెట్టుకోవాలన్నారు. పంటనూర్పి కల్లాల్లో ఉంటే ధాన్యాన్ని సురక్షిత ప్రదేశానికి చేర్చుకోవాలని కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



నకరికల్లు: కార్తీకమాసం పురస్కరించుకొని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు అన్నారు. త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహ్య విషయాలు వీడి అంతర్ముఖులై చూస్తే ఆత్మదర్శనం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాతం– ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోశాలలో కార్తీక వనసమారాధన



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల గో సంరక్షణ శాలలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక సమారాధన ఆదివారం సందడిగా సాగింది. ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆర్యవైశ్య దంపతులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూధన్‌రావు, ఉపాధ్యక్షుడు, గో సంరక్షణశాల అధ్యక్షుడు మాడ నాగరమేష్, ఉపాధ్యక్షుడు అన్నా సుమన్, కార్యదర్శి తొమండ్రు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు, కోశాధికారి కనమర్లపూడి సుబ్బారావు, దేవరశెట్టి రవి కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతికి సమీపాన ముత్తాయిపాలెం గ్రామంలో వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ముత్తాయిపాలెం చేరుకున్నారు. ఉదయం ఆరు గంటలకు ఆలయంలో పూజలు ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ అనంతరం బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో 8గంటలకు గణపతి హోమం, గ్రామదేవతల ఆహ్వానంలో ఊరుబయట ఉన్న గ్రామ దేవతల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరాశరం రామకృష్ణమాచార్యులు యాజ్ఞీక పర్యవేక్షణలో భక్తులచే లక్ష్మీనారాయణ, గాయత్రీ, సుదర్శన హోమం నిర్వహించి అమ్మవారికి ఏకనామ కుంకుమార్చన, శాంతిహోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పలురకాల పుష్పమాలలతో కన్నుల పండువగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్ళు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

మాచర్ల: ప్రతి ఒక్క వ్యక్తి ఓటు హక్కు పొందటానికి ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. ఆదివారం ప్రత్యేకంగా 46 కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రాంతాలను పరిశీలించి ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని 46 కేంద్రాలలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. పట్టణానికి సంబంధించి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరిని పరిశీలించి చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

గురజాల : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.రమణాకాంత్ రెడ్డి అన్నారు. రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ క్యాంపులను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన వారు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ మీసాల దానియేలు, నగర పంచాయతీ కమిషనర్ ఏ మోహన్ శ్రీనివాస్‌లు పరిశీలించారు.

పల్నాటి ఉత్సవాలకు కొనసాగుతున్న పనులు

పల్నాటి రణస్థలికి తరలివచ్చే వీరాచారులకు, భక్తులకు సౌకర్యాల కల్పన



మెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో పల్నాటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన జరుగుతోంది. నాగులేరు గంగధారి మడుగుకు ఇరువైపులా ఆదివారం మెట్ల నిర్మాణం చేశారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్ దగ్గరుండి పనులు చేయించారు. గంగధారిలో దిగి పల్నాటి వీరాచారవంతులు ఆయుధాలు శుభ్రం చేసుకోడానికి వీలుగా సర్పంచ్ మెట్లు నిర్మాణ పనులు చేయించారు. గంగధారి మడుగు ఒడ్డునే వీరుల గుడి ఉంది. పల్నాటి వీరాచారవంతులు తమ ఆయుధాలు (దైవాలు)తో తరలివచ్చి ముందుగా నాగులేరు గంగధారిలో స్నానాలాచరించి ఆయుధాలను శుభ్రం చేసుకుంటారు. అదే విధంగా ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి రోజూ గంగధారిలో వీరాచారవంతులు స్నానాలాచరించడం చేస్తారు. ఇదిలా ఉంటే పల్నాటి వీర్ల అంకాలమ్మతల్లి గుడి సమీపంలో ఉన్న బాలచంద్రుని పాట్టేలు దూకిన పాద ముద్రలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడకు సమీపంలోని కోట బురుజుకు, తోట బజారులో ఉన్న బ్రహ్మనాయుడు మేడ (కత్తుల బావి మేడ), కన్నమదాసు మండపానికి రంగులు వేయిస్తున్నారు. ఇప్పటికే రణక్షేత్రంలో బ్రహ్మనాయుడు విగ్రహం ఉంది. కన్నమదాసు మండప ప్రాంగణంలో కన్నమదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవ ప్రాంగణంలో ప్రజలకు వినోదాన్ని అందించే వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పల్నాటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ పాలక వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దేవదాయ శాఖ కూడా చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మతల్లి దేవాలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. ఉత్సవాల మూడవ రోజు మందపోరు నాడు జరిగే బ్రహ్మనాయుడు చాపకూడు సహపంక్తి భోజనాలకు జిల్లా ప్రజా పరిషత్ కొన్నేళ్లుగా పీఆర్కే చొరవతో చేయూతనందిస్తోంది.

వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించాలి

- ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు దేవుని బిడ్డలు
- కొమెరపూడి గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్



బహుమతులు అందుకుంటున్న విజేతలు

సత్తెనపల్లి: దివ్యాంగులు దేవుడిచ్చిన అద్భుతాలని వారు ఆత్మస్థైర్యంతో వైకల్యాన్ని జయించేలా మన మందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొమెరపూడి సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని చిమట లీలావతి ఫౌండేషన్ వారి కమిట్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో దివ్యాంగులకు నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆ సంస్థ సత్తెనపల్లి ఏరియా సమన్వయకర్త సీహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని, స్వచ్ఛంద సేవా సంస్థల సహాయాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు షేక్ యలవర్తిపాటి ఈసా, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

బొల్లాపల్లి: పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 15 టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు బాపట్ల, బేతపూడి, పల్నాడు, రెడ్డిపాలెం టీమ్‌లు వరుసగా గెలుపొందాయి. గెలుపొందిన విజేతలకు శ్రీచక్ర సిమెంట్స్, శివశక్తి లీలా ఫౌండేషన్, రెడ్డిపాలెం ఎంప్లాయిస్ యూనియన్ తదితరులు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ బహుమతుల్లో ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ 15,116, తృతీయ 10,116, 4వ బహుమతి 7,116లు విజేతలకు అందజేశారు